


సంక్రాంతి సంబరాలు

నాదెండ్ల: చందవరం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు తీర్చిదిద్ది భోగి మంటలు వేశారు.



శివాలయంలో పూజలు

కొల్లూరు: అనంత భోగేశ్వర స్వామి 910వ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని శివాలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 566.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.

కౌలుకోలేనంత నష్టం!

కూటమి ప్రభుత్వ హయాంలో అన్నదాతలను అడుగడుగునా ముంచుతున్నారు. ఇప్పటి వరకు రైతుల వద్ద సిద్ధంగా ఉన్న ధాన్యంలో పట్టుమని 7.4 శాతం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. మిల్లర్లతో కుమ్మక్కైన కొందరు అధికారులు అందిన కాడికి ముడుపులు పుచ్చుకొని మొక్కుబడిగా తతంగం నడుపుతున్నారు.



ధాన్యం సక్రమంగా కొనకపోవడంతో మిల్లుల వద్ద తప్పని పడిగాపులు (ఫైల్)

- ధాన్యం కొనుగోలులో చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- జిల్లాలో మొత్తం 2,16,434 ఎకరాలలో వరి సాగు
- ధాన్యం దిగుబడి అంచనా 5,62,729 మెట్రిక్ టన్నులు
- ఇప్పటివరకు కోత కోసిన వరి 1,32,363 ఎకరాలు
- 3,44,144 మెట్రిక్ టన్నులకుగాను కొన్నది 7.4 శాతమే
- జిల్లాలో ఉన్న 80 శాతం కౌలు రైతులకు కోలుకోలేని నష్టం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో భారీగా వరి సాగైంది. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర బస్తాకు రూ. 1,740 ఇవ్వడం లేదు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా కౌలు రైతులు పూర్తిగా దెబ్బతిన్నారు. జిల్లాలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. వారంతా ఎకరానికి దాదాపు రూ. 30 వేల నుంచి రూ.40 వేలు కౌలు చెల్లించడమే కాక, పంటకు పెట్టుబడులు పెట్టారు. ఇప్పటికే పలు రకాల నిబంధనలతో ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇవ్వకుండా వంచించింది. కొనుగోళ్ల వివరాలు ఇచ్చేందుకు కూడా అధికారులు జంకుతున్నారు.

కొన్నది గోరంతే..

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో బాపట్ల, చీరాల, రేపల్లె వ్యవసాయ డివిజన్ల పరిధిలో 2,16,434 ఎకరాల్లో వరి సాగు చేశారు. 5,62,729 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా కట్టారు. ప్రస్తుతం 1,32,363 ఎకరాల్లో కోతలు పూర్తి కావడంతో 3,44,144 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది. సర్కారు కొనుగోలు చేసిన ధాన్యం మాత్రం 46,199 మెట్రిక్ టన్నులే కావడం గమనార్హం. ఇంకా 84,071 ఎకరాల్లో పంట కోత దశలో ఉంది. 2,18 585 మెట్రిక్ టన్నుల దిగుబడి రానుందని అంచనా. ఈ ధాన్యాన్ని ఎవరు కొనాలో ప్రభుత్వమే చెప్పాలి.

జగనే ఉండి ఉంటే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్నప్పుడు రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలు, మార్కెట్ యార్డుల ద్వారా ఎప్పటికప్పుడు కొనుగోలు చేసేవారు. దళారుల ప్రమేయానికి అడ్డుకట్ట వేశారు. కేటాయించిన మిల్లర్లతో కచ్చితంగా రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయించారు. వర్షం వచ్చినా ఇబ్బందులు కలగకుండా తడిసిన ధాన్యాన్ని సైతం కొన్నారు. ఎక్కడా రైతులు నష్టపోయే పరిస్థితి తలెత్తలేదు.



బాపట్ల ప్రాంతంలో ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

పదవి తండ్రిది... పెత్తనం కుమారుడిది...

- చీరాలలో పేరుకే ఎంఎం కొండయ్య ఎమ్మెల్యే
- పెత్తనం మొత్తం కుమారుడిదే
- అధికారిక కార్యక్రమాలకూ హాజరు
- అధికారులు సైతం ఆయన చెప్పినట్లు వినాల్సిందే

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఆయన పచ్చ పార్టీ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కొంతకాలంగా నియోజకవర్గంలో ఆయన మాట సాగడం లేదు. పెత్తనమంతా ఆయన తనయుడు మహేంద్రది. ప్రతి కార్యక్రమానికి హాజరవుతారు. పోలీసుల పైలటింగ్ ఆయనకే ఇస్తారు. అధికారులు సైతం ఆయననే కార్యక్రమాలకు ఆహ్వానిస్తున్నారు. బదిలీలు, పనులు, ఏ కార్యక్రమమైనా ఇప్పుడు ఎమ్మెల్యే చిన్న కుమారుడు చెప్పినట్లు జరగాల్సిందే. ఆయన ఇప్పుడు చీరాలకు అనధికార ఎమ్మెల్యే. తన తండ్రిది ఏమీ లేదని, వచ్చే ఎన్నికల్లో తనకే టికెట్ అని, పోటీలో ఉంటానని మహేంద్ర అందరికీ చెబుతున్నట్లు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆయన రాబోయే ఎన్నికల్లో అభ్యర్థిగా నిలబడితే ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ ప్రజాప్రతినిధిగా ఎన్నిక కాకుండానే తండ్రిని పక్కనబెట్టి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంపై విమర్శలు వస్తున్నాయి. అధికారులను శాసించడం కూడా అభ్యంతరకరం, నిబంధనలకు విరుద్ధం. పచ్చ పార్టీలో చాలామంది పదవులు, హోదాలు లేకపోయినా మంత్రుల భార్యలు, ఎమ్మెల్యే సోదరులు, తనయులు పెత్తనం సాగిస్తుండటం పరిపాటిగా మారింది. చీరాల ఎమ్మెల్యే తనయుడు కూడా వారందరినీ ఆదర్శంగా తీసుకున్నట్లుంది. అందుకే ఆయన అంతా తానై వ్యవహరిస్తున్నారు. అధికారులు కూడా ఎమ్మెల్యే తనయుడు అన్న కారణంతో భయంగా సభలు, సమావేశాలకు ఆహ్వానిస్తున్నారు.

పాఠశాల కార్యక్రమంలో అన్నీతానై..

తాజాగా ఎమ్మెల్యే తనయుడు వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ప్రధాన పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు శేఖరరావు ఘనంగా స్వాగతం పలకగా చీరాల డివిజన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి శ్రీనివాసరావుతో పాటు పలువురు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు సైతం పంపిణీ చేశారు. ఎమ్మెల్యేలకే లేని పైలట్‌ను వేటపాలెం ఎస్సై ఈయనకు ఏర్పాటు చేశారు. వాస్తవానికి కూటమి సర్కార్ కొలువుదీరాక ఎమ్మెల్యేలు పోలీసు ఎస్కార్ట్(పైలటింగ్)ను ఉపయోగించుకోకూడదని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. దీంతో కొందరు ఎమ్మెల్యేలు పైలటింగ్‌కు దూరంగా ఉన్నారు. కానీ చీరాలలో ఎమ్మెల్యే తనయుడికి పోలీసు ఎస్కార్ట్ అనివార్యంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు ఎమ్మెల్యే తనయుడికి ఎస్కార్ట్ ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే చీరాలలో ఇసుక అక్రమ రవాణా వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ప్రభుత్వ, అసైన్డ్ భూముల కబ్జాల వ్యవహారం తరచూ వెలుగులోకి వస్తున్నాయి.





చీరాల ఎమ్మెల్యే కొండయ్య తనయుడు అధికారిక కార్యక్రమాలకు హాజరైన ఫొటోలు. గురువారం వేటపాలెం మండలం పందిళ్లపల్లి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కూడా ఆయనే పాల్గొనడం గమనార్హం.

న్యూస్‌రీల్

వైభవంగా రాధాకృష్ణుల కల్యాణం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలోని హనుమత్ గీతామందిరంలో గురువారం రాధాకృష్ణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. గీతామందిర ధర్మకర్తలైన వలివేటి చంద్రమౌళి, శంకర్ ఆధ్వర్యంలో జరిపిన ఈ కల్యాణ క్రతువును యాజ్ఞిక బ్రహ్మ బృందావనం ఆదిత్య నరసింహమూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు. క్రతువులో తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ మండపారాధన, లగ్నాష్టకాలు శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణంలో 10 జంటలు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పీసపాటి నాగేశ్వరశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

యార్డుకు 70,712 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 70,712 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 69,119 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,200 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,300 నుంచి 16,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,400 నుంచి రూ.14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ.15,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 54,442 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విజయవాడ: ఇంద్రకీలాద్రి దుర్గమ్మ నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు సి.వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో దర్శనభాగ్యం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ డీఈఓ రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1,818 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 144, తూర్పు కెనాల్‌కు 270, పశ్చిమ కెనాల్‌కు 110, నిజాంపట్నం కాలువకు 74, కొమ్మమూరు కాలువకు 505 క్యూసెక్కులు విడుదల చేశారు.

దుర్గమ్మ సేవలో ముఖేష్‌కుమార్ మీనా



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర రెవెన్యూ(ఎక్సైజ్)శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ముఖేష్‌కుమార్‌మీనాకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

బీచ్‌ను సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: సూర్యలంక బీచ్‌ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా బీచ్‌లో కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఈ బీచ్‌కి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. అభివృద్ధి పరిస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ఎకరానికి 160 చొప్పున 7 ఎకరాల్లో కొబ్బరి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. రూ. 10 లక్షలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. మొక్కలను పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి పి.గ్లోరియా, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా అటవీ శాఖ అధికారి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటునందించాలి

జిల్లా అభివృద్ధికి పాత్రికేయులు సానుకూల దృక్పథంతో తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. గురువారం స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాలెండర్, డైరీలను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

కేంద్ర బృందంతో భేటీ

'ఒక జిల్లా – ఒక ఉత్పత్తి' కింద ఎంపికైన చీరాల కుప్పడం చీరలకు జాతీయ స్థాయిలో ప్రత్యేకత ఉందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ఇక్కడి చీరలు ఎంపికైన నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర బృందం సభ్యులు ఇష్ దీప్, డాక్టర్ దివ్యడింగ్రా గురువారం జిల్లాకు చేరుకున్నారు. వారిని జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కుప్పడం చీరల ప్రదర్శనను వారితో కలిసి పరిశీలించారు. కేంద్ర బృందానికి అధికారులు నివేదిక అందజేశారు. చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వనిజ, సంయుక్త సంచాలకులు కె.కన్నబాబు, జిల్లా సహాయ సంచాలకులు కె. నాగమల్లేశ్వరరావు, డీఓలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పని కల్పించాలి..

గ్రామాలలోని నిరుపేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా జీవనోపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గురువారం క్యాంప్ కార్యాలయం నుంచి మండల అధికారులతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాలలో కేటాయించిన పనులను వంద శాతం పూర్తి చేయాలన్నారు. డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి,, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.ఉమ పాల్గొన్నారు.

వైద్యశిబిరం పరిశీలన

బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ , బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ, తహసీల్దార్ షలీమా, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నుకోట సురేష్, వంగపాటి శివ పాల్గొన్నారు.



కొబ్బరి మొక్క నాటుతున్న జిల్లా కలెక్టర్

దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు

ఎస్పీ తుషార్‌డూడి



బాపట్ల: ముక్కోటి ఏకాదశి పండుగ పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా దేవాలయాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తీసుకోవలసిన ముందస్తు భద్రత చర్యల గురించి గురువారం స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముక్కోటి ఏకాదశి పండుగ పురస్కరించుకొని ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని శుక్రవారం వేకువ జాము నుండే దేవాలయాల వద్ద, పరిసర ప్రాంతాలలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులు తాకిడి అధికంగా ఉన్న దేవాలయాల వద్ద బ్యారికేడింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. భక్తులు తప్పని సరిగా క్యూ లైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా నిఘా ఉంచాలని సూచించారు. దేవదాయ శాఖ అధికారులు, దేవాలయ కమిటీ సభ్యులతో సమన్వయంతో వ్యవహరిస్తూ భక్తులకు కావలసిన సౌకర్యాలను కల్పించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. దేవాలయాలకు వచ్చే భక్తులు పోలీస్ శాఖ సూచనలు పాటించాలని ఎస్పీ సూచించారు. తోపులాట లేకుండా క్యూ పద్ధతి పాటిస్తూ దైవ దర్శనం చేసుకోవాలని తెలిపారు. మహిళలు బంగారు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

లిక్కర్ మాఫియాలో బెల్టు చిచ్చు

- రూ.3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు చెల్లించాల్సిందే
- మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు
- అదనపు ధరలతో సామాన్యులను దోచుకుంటున్న వైనం

కూటమి ప్రభుత్వం వచ్చాక ఊరూరా 'బెల్టు' షాపులే

చీరాల: చీరాలలో లిక్కర్ మాఫియా రోజురోజుకీ సంపాదనే ధ్యేయంగా మద్యం పారిస్తోంది. అధికారంలో ఉండటంతో కూటమి పార్టీల నాయకులు, కొంతమంది వ్యాపారులు బరి తెగించి మద్యం విక్రయిస్తున్నారు. చీరాల ఎక్సైజ్ సబ్ డివిజన్ పరిధిలో 24 మద్యం దుకాణాలు ఉన్నాయి. ప్రతి షాపులో అనధికారికంగా సిట్టింగ్ రూములు ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం ఉదయం 10 – రాత్రి 10 గంటల వరకు షాపు తెరవాలి. చీరాల్లో మాత్రం నిత్యం మద్యం ఏరులై పారుతోంది. రాత్రి 10 గంటల తరువాత క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ. 20 నుంచి రూ. 30 వరకు వసూలు చేస్తున్నారు. ఎమ్మార్పీకి విక్రయిస్తే సంపాదించుకోలేమని బాహాటంగానే వారు చెబుతున్నారు.

చీరాల సబ్ డివిజన్ సర్కిల్ పరిధిలోని 24 షాపుల్లో మొదట సిండికేట్ కోసం సమావేశాలు జరిగాయి. అధికార పార్టీ నాయకుడు తనకే పెత్తనం ఇవ్వాలన్నారు. ఎక్సైజ్ అధికారులు, కూటమిలోని ఇతర పార్టీ నాయకులకు మామూళ్ల వ్యవహారం కూడా తాను చూస్తానని చెప్పారు. కానీ ఆయన్ను వ్యాపారులు అంగీకరించలేదు. ఆయన అనుచరుడికి మాత్రం బాధ్యతలు అప్పగించారు. ఆ అనుచరుడి సోదరుడు కూడా మద్యం షాపులు నడుపుతున్నారు. ఈ సోదరుల మధ్య ఆస్తి, కుటుంబ, రాజకీయ వైరాలు ఉన్నాయి. దీంతో సిండికేట్ బాధ్యతల స్వీకరణ కోసం బల నిరూపణకు సిద్ధమయ్యారు.

రూ.5 లక్షలిచ్చి నిర్వహణ

వాస్తవానికి వేటపాలెం మండలం కఠారివారిపాలెంలో బెల్టు షాపు నిర్వహణకు రూ. 5 లక్షలు గ్రామ అభివృద్ధికి చెల్లించేలా వేలంపాట నిర్వహించుకున్నారు. అధికార పార్టీలో ఉన్న సోదరుడికి ఈ బెల్టు షాపు దక్కింది. దీనికి పోటీగా ఆయన సోదరుడు కూడా బెల్టుషాపు ఏర్పాటు చేశారు. ఆగ్రహించిన అన్న... తన అధికారాన్ని ఉపయోగించి తమ్ముడి బెల్టు షాపును పోలీసులకు పట్టించారు. మత్స్యకార గ్రామాల్లో బెల్టు షాపుల నుంచి ఖరీదైన మద్యం కొనుగోలు చేసి వాడ రేవు నుంచి పొట్టిసుబ్బయ్యపాలెం పరిధిలోని 35 రిసార్టులకు ఇస్తున్నారు. ఆ సమయంలో క్వార్టర్‌కి అదనంగా రూ.50 తీసుకొని సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం రిసార్టులకు మద్యం సరఫరా చేయకూడదు. అధికార పార్టీ వారే ఇలా చేయడంతో యంత్రాంగం స్పందించడం లేదు.



పట్టుబడ్డ మద్యంతో ఎస్సై, పోలీసులు

గ్రామానికి రెండు..

చీరాల నియోజకవర్గం పరిధిలోని చీరాల, వేటపాలెం మండలాలలో దాదాపు 45 గ్రామాలు ఉన్నాయి. ఇక్కడి ప్రతి గ్రామంలో రెండు బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. క్వార్టరుకి రూ. 20, రూ. 30 అధికంగా విక్రయిస్తున్నారు. అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ డివిజన్ స్థాయి అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దాడులు చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా ముందుకు రాలేదు. దీనిపై రాష్ట్ర స్థాయి ఎక్సైజ్ అధికారులు పూర్తి స్థాయిలో ఆకస్మిక దాడులు చేయాల్సి ఉంది.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి కృషి



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు కేసులు పరిష్కరించుకుని సమయం, ధనం వృథా కాకుండా చూసుకోవాలని సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రతినిధులు ఆచార్య అడ్వకేట్ ప్రమీల (రాజస్థాన్), ఆచార్య అడ్వకేట్ వి.పి.తంకచన్ (కేరళ) చెప్పారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎంపికైన న్యాయాధికారులకు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ నిర్వహిస్తున్న విషయం విదితమే. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, జిల్లా కార్యదర్శి టి.లీలావతి, సీనియర్ న్యాయమూర్తులు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనురాధ హాజరయ్యారు.

నేడు గుంటూరుకు సీఎం చంద్రబాబు

కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక స్తంభాలగరువులోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో ఎస్పీ సతీష్ కుమార్, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం నరెడ్కో ప్రాపర్టీ షోకు ముఖ్యఅతిథిగా సీఎం హాజరవుతున్నారని వెల్లడించారు. పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ సుప్రజా, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. కన్వెన్షన్ హాల్‌లోని హెలిపాడ్ నుంచి చేబ్రోలు హనుమయ్య కంపెనీ సభ ప్రాంగణం వరకు ట్రైల్ కాన్వాయ్‌లో ప్రయాణించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్), ఎస్బీ డీఎస్పీ బి.సీ తారామయ్య పాల్గొన్నారు.

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో శుక్రవారం జరిగే నేరెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్న నేపథ్యంలో హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు నగరపాలక సంస్థ చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులను, రోడ్ల ప్యాచ్ వర్క్‌లను పక్కాగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ హెలిప్యాడ్ నుంచి సభ జరిగే హనుమయ్య కంపెనీ వరకు అధికారులతో కలిసి పర్యటించారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సీఎం పర్యటన మార్గంలో విధుల నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృత పాల్గొన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ తదితరులు

క్లుప్తంగా

జాతీయ ఖోఖో జట్టులో శివారెడ్డికి చోటు

విజయవాడ స్పోర్ట్స్: ఖోఖో ప్రపంచ కప్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే భారత జట్టులో రాష్ట్ర క్రీడాకారుడు శివారెడ్డి చోటు దక్కించుకున్నాడు. ఢిల్లీలో గురువారం జరిగిన జాతీయ జట్టు ఎంపిక పోటీల్లో శివారెడ్డి అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించాడు. ప్రకాశం జిల్లాకు చెందిన శివారెడ్డి పోస్టల్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. జె.పాంగలూరులోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమిలో గత కొన్నేళ్లుగా శివారెడ్డి శిక్షణ తీసుకుని ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే ప్రపంచ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శివారెడ్డిని ఖోఖో రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఎం.సీ తారామిరెడ్డి, రిఫెరెన్స్ బోర్డు కన్వీనర్ మడకా ప్రసాద్ అభినందించారు.

రూ.7.50 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్ల దహనం



చీరాల: క్యాన్సర్‌కు కారకమైన గుట్కా ప్యాకెట్లను పోలీసులు దహనం చేశారు. చీరాల వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్కాల వ్యాపారి నుంచి సీజ్ చేసిన 50 బస్తాలలోని రూ.7.50 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను కోర్టు ఉత్తర్వులతో గురువారం తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సమక్షంలో వన్‌టౌన్ సీఐ ఎం.శ్రీనివాసరావు ఆధ్వహనం చేశారు. ఈసందర్భంగా వన్‌టౌన్ సీఐ మాట్లాడుతూ.. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020 డిసెంబర్‌లో ఈపురుపాలేనికి చెందిన కూర్మాల బాలశంకర్ గుప్తా అనే వ్యక్తి అక్రమంగా గుట్కాల వ్యాపారం చేసేవాడు. పోలీసుల తనిఖీల్లో లారీలో రవాణా చేస్తున్న 50 బస్తాల గుట్కాలు, ఖైనీలను గతంలో సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు కోర్టు ఉత్తర్వుల మేరకు పట్టణంలోని శివారు ప్రాంతంలో గుట్కా ప్యాకెట్లు దహనం చేశామన్నారు. కార్యక్రమంలో సీఐతో పాటుగా ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



అద్దంకి రూరల్: బైకు మీద వెళ్తున్న ఆటో డ్రైవర్‌ను వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీ కొట్టటంతో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వేలమూరిపాడు గ్రామానికి చెందిన గోపబోయిన బాలకృష్ణ (37) ఆటో డ్రైవర్. గురువారం సాయంత్రం గ్రామానికి వెళ్లి ఆటో ఇంటి వద్ద పెట్టి ద్విచక్రవాహనంపై అద్దంకి వస్తున్నాడు. మార్కెట్ యార్డు సమీపంలో వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టడంతో గాయాల పాలయ్యాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందాడు. బాలకృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

- చెన్నై, మార్టూరు జట్ల ముందంజ
- భారీగా తరలివచ్చిన ప్రేక్షకులు



తలపడుతున్న ఇరు జట్లు

మేదరమెట్ల: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భ్రమర సంక్రాంతి కప్ 2025లో భాగంగా గురువారం జరిగిన రెండు మ్యాచ్‌లలో మస్తాన్ లెవెన్ (మార్టూరు) జట్టు, ఎంఆర్‌సీసీ లెవెన్ (చెన్నై) జట్టు విజయం సాధించాయి. ఉదయం జరిగిన మ్యాచ్ నెక్స్‌జెన్ సీపీ లెవెన్ హైదరాబాద్, మస్తాన్ లెవెన్ మార్టూరు జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన మార్టూరు జట్టు ప్రత్యర్థి జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్యాటింగ్ ఆరంభించిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులు మాత్రమే చేసింది. ఈ జట్టులో అనిరుధ్ 44 బంతుల్లో 3 ఫోర్ల సాయంతో 37, వరుణ్‌వినోద్ 30 బంతుల్లో 30 పరుగులు చేశారు. మార్టూరు జట్టు బౌలర్లు ప్రదీప్‌రెడ్డి మూడు ఓవర్లు బౌల్ చేసి 25 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు, హితేష్‌కుమార్ 4 ఓవర్లు వేసి 23 పరుగులు ఇచ్చి రెండు కీలక వికెట్లు తీశారు. అనంతరం 134 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన మార్టూరు జట్టు కేవలం 13.1 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే నష్టపోయి విజయలక్ష్యాన్ని చేరుకుంది. ఈ జట్టులో సీపీ వెంకటేష్ 34 బంతుల్లో 4 సిక్స్‌లు, 6 ఫోర్లతో 64 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ ప్రశాంత్ 23 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్ తో 30పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి జట్టు విజయానికి దోహదపడ్డాడు. దీంతో ఎనిమిది వికెట్ల భారీ తేడాతో మార్టూరు జట్టు హైదరాబాద్ జట్టుపై విజయం సాధించింది.

19 పరుగుల తేడాతో చెన్నై జట్టు విజయం..

మధ్యాహ్నం జరిగిన పోటీ ఎంఆర్‌సీసీ లెవెన్ (చెన్నై), సౌత్‌సెంట్రల్ రైల్వేస్ (సికింద్రాబాద్) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన చెన్నై జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 168పరుగులు చేసింది. చెన్నై జట్టులో విజయకుమార్ 21 పరుగులు, సుధాన్ సంజీవి 25 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్ సాయంతో 37 పరుగులు చేశారు. అనంతరం 169 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సికింద్రాబాద్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 149 పరుగులు మాత్రమే చేయగలిగింది.



64 పరుగులు సాధించిన బ్యాటర్ సీపీ వెంకటేష్

ఈ జట్టులో ధర్మనరేన్‌రెడ్డి 39 బంతుల్లో ఒక ఫోరు రెండు సిక్స్‌ల సాయంతో 41 నాటౌట్ ఒంటరి పోరు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ ధరణి 24 బంతుల్లో రెండు ఫోర్ల సాయంతో 30 పరుగులు చేశాడు. చెన్నై బౌలర్లు ఉదయ్‌కుమార్, నిరాంకర్ శర్మ చెరో రెండు వికెట్లు తీశారు. దీంతో 19 పరుగుల తేడాతో చెన్నై జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లకు అంపైర్లుగా శ్రీనివాస్, రాజు, స్కోరర్, వ్యాఖ్యాతగా సాయిరాజ్ వ్యవహరించారు.

నేటి మ్యాచ్‌ల వివరాలు..

ఉదయం 9.30 నికి జీడీసీఏ లెవెన్ (గుంటూరు) వర్సెస్ మస్తాన్ లెవెన్ (మార్టూరు) జట్ల మధ్య, మధ్యాహ్నం మ్యాచ్ ఎంఆర్‌సీసీ లెవెన్ (చెన్నై) వర్సెస్ మిస్‌రాకీ లెవెన్ (చెన్నై) జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు (బాబు) తెలిపారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

ప్రకృతి వ్యవసాయం బాపట్ల డీపీఎం వాణిశ్రీ



ద్రావణం తయారీని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం బాపట్ల డీపీఎం

భట్టిప్రోలు: సేంద్రియ సాగు వల్ల మంచి దిగుబడి వస్తుందని ప్రకృతి వ్యవసాయం బాపట్ల డీపీఎం వి. వాణిశ్రీ పేర్కొన్నారు. గురువారం ఆమె భట్టిప్రోలు మండలం వెల్లటూరు విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన జడా అశోక్ పంట పొలాన్ని పరిశీలించారు. రైతు సాధికార సంస్థ పర్యవేక్షణలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో సేంద్రియ పంటలకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. రసాయనాలతో సాగుచేయడం వల్ల పెట్టుబడి అధికం అవుతుందన్నారు. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ఆదరణ ఉంటుందని చెప్పారు. కోడిగుడ్డు- నిమ్మరసం ద్రావణం తయారీ విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ ద్రావణం మొక్క ఎదుగుదలకు ప్రోటీన్లను అందిస్తుందని చెప్పారు. నాణ్యమైన పండ్లను ఉత్పత్తి చేయవచ్చునని అన్నారు. ద్రావణాన్ని పంటలపై పిచికారీ చేయడం వల్ల పంటలు ఆరోగ్యంగా పెరుగుతాయని పేర్కొన్నారు. 250 మిల్లీ లీటర్ల ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు సాయంత్రం వేళల్లో పిచికారి చేయాలని సూచించారు. తద్వారా రసం పీల్చే పురుగులు ఆశించవని చెప్పారు. ఈ ద్రావణం 3 నెలల పాటు నిల్వ ఉంటుందని వివరించారు. అలాగే మెట్టగౌడవారి పాలెంలో ఏటీఎం బెడ్లలో విత్తనాలు దగ్గర ఉండి వేయించారు. ఆమె వెంట ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నందన, వరదనమ్మ (ఎన్ఎఫ్ఏ), మాస్టర్ ట్రైనర్స్ శ్రీనివాసరెడ్డి, ప్రకాష్, ఐసీఆర్పీ యూనిట్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.7.29 లక్షలు

చందోలు(కర్లపాలెం): గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం ఆరునెలలకుగాను రూ.7,29,180 వచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. ఆలయం హుండీతోపాటుగా శ్రీ లింగోద్భవ స్వామి వారి దేవస్థానం శ్రీ చెన్నకేశవస్వామి వారి దేవస్థానముల హుండీలను ఆలయ మేనేజర్ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించినట్లు తెలిపారు. లింగోద్భవ స్వామి వారి దేవస్థానంలో ఒక సంవత్సరానికి గాను హుండీ ఆదాయం రూ.34,586, శ్రీ చెన్నకేశవస్వామివారి దేవస్థానం హుండీ ఆదాయం రూ.15,659 వచ్చినట్లు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఎండోమెంట్ బాపట్ల డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి, పొన్నూరు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ రాజేష్, సతీష్, చందోలు పంచాయతీ కార్యదర్శి బి.సుజాత, పోలీస్ సిబ్బంది పి.సాంబశివరావు, ఎ.కొండలురెడ్డి, మాధవి, ఆలయ అర్చకులు వెంకటసుబ్బయ్య, శ్రీనివాసు, వరదాచార్యులు, కుంచాల నరసారెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

చీరాల: మనస్తాపంతో బాధపడుతున్న ఓ మహిళ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం పట్టణంలోని జవహర్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. జవహర్‌నగర్‌కు చెందిన పాలపర్తి నాగేంద్రం (49) కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఒంటరిగానే ఉంటోంది. తీవ్ర మనోవేదనతో బాధపడుతున్న నాగేంద్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12న కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉపకార వేతనాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 19వ ఉపకార వేతన పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ తెలిపారు. గుంటూరులోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ శివారులోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఏపీ, తెలంగాణలకు చెందిన టెన్త్ నుంచి పీహెచ్‌డీ వరకు ప్రతిభ గల 555 మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు రూ.22 లక్షల మేరకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. ట్రస్టు ప్రారంభం మొదలు ఇప్పటి వరకు ఏడు వేల మందికి రూ.2.10 కోట్లు ఉపకార వేతనాలుగా అందించామని వివరించారు. సొంత భవనంలో బ్యాంకింగ్ , గ్రూప్స్ సహా అన్ని పోటీ పరీక్షలకు నామమాత్రపు ఫీజుతో నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న ఈవీ నారాయణ, సేవా కుమార్ తదితరులు

ఉపకార వేతన పంపిణీ సభకు జస్టిస్ అమర్నాథ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందర్ కుమార్, విశ్రాంత డీజీపీ అత్తిలి సుధాకర్, విశ్రాంత ఐజీ జక్కంశెట్టి సత్యనారాయణ, పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ బాబు, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎస్పీలు ఎస్.సతీష్‌కుమార్ , కె. శ్రీనివాసరావు తదితర ప్రముఖులు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి ట్రస్టు సభ్యులు, విరాళ దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో ట్రస్టు సభ్యుడు డాక్టర్ టి. సేవాకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ ఫుడ్-2025లో తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్



తెనాలి: తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ ఈ నెల 8–10వ తేదీల్లో ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్, గ్రేటర్ నొయిడా, ఎన్‌సీఆర్-ఢిల్లీలో జరుగుతున్న అతిపెద్ద ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతి కేంద్రీకృత వాణిజ్య ప్రదర్శనల్లో ఒకటైన ఇండస్ ఫుడ్-2025లో తన భాగస్వామ్యాన్ని చాటింది. 20 దేశాల నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలను ఒకచోట చేర్చిందీ కార్యక్రమం. ప్రపంచ ఆహార ఆవిష్కరణలు, భాగస్వామ్యాలను అన్వేషించటానికి ఎగ్జిబిటర్లు, అయిదు వేలకుపైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు ఎక్స్‌పోను సందర్శిస్తున్నారు. తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ సీఎండీ మునగాల మోహన్‌శ్యాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ఆహారం నాణ్యత, సంప్రదాయ విలువలను పరిచయం చేయడానికి ఈ వేదిక ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. నాణ్యత, సంప్రదాయం, ఆరోగ్యంపై నిబద్ధతను ప్రదర్శిస్తూ, భారతీయ గ్రామీణ ఆహార సంస్కృతి గొప్పదనాన్ని ప్రపంచానికి పరిచయం చేయడాలనికి ఇండస్ ఫుడ్ తమకు అసాధారణమైన అవకాశాన్ని కల్పించిందన్నారు. తమ ప్రయాణంలో ఇదొక గొప్ప మైలురాయిగా వ్యాఖ్యానించారు. రెండేళ్లుగా ఇండస్ ఫుడ్‌తో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నట్టు తెలిపారు. ఎగ్జిబిషనులో తమ స్టాల్‌ను సందర్శించాలని తెనాలి డబుల్‌హార్స్ జీఎం పీఎస్‌వీ కృష్ణప్రసాద్ కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

గురజాల: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని మాడుగుల శివారులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... దాచేపల్లి నగర పంచాయతీకి చెందిన ఇరికేపల్లి బోటు మీద నారాయణపురంకు చెందిన ఆవుల కొండ (35) వరి పొలంలో ఎలుకలకు మందు పెట్టడం, వరి పొలంలో బుట్టలు పెట్టడం వంటివి చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వరి పొలంలో ఎలుకల మందు పెట్టడానికి వెళ్తున్నానని చెప్పి వచ్చాడు. రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన పేరం సీతారెడ్డి గురువారం సాయంత్రం వరి పొలంలో రేపు మందు కొట్టడానికి నీరు సరిపడా ఉందా లేదా అని చూడటానికి పొలంకు వచ్చాడు. పంట పొలంలో శవం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి పరిశీలించగా ఆవుల కొండగా నిర్ధారించారు. మృతుడికి భార్య, అయిదుగురు సంతానం కలరు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖోఖో సెలక్షన్ కమిటీ సభ్యుడిగా సీతారామిరెడ్డి



మేకల సీతారామిరెడ్డి

జే.పంగులూరు: ఢిల్లీలో జరగనున్న ఖోఖో ప్రపంచ్ కప్ పోటీల్లో టీమ్ ఇండియా సెలక్షన్ కమిటీలో పంగులూరు గ్రామవాసి, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి నామినేట్ అయినట్లు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. ఈ అవకాశం కల్పించిన ప్రెసిడెంట్ సుదాసు మిట్టల్, జనరల్ సెక్రెటరీ ఎంఎస్ త్యాగికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సీతారామిరెడ్డికి ఆంధ్రప్రదేశ్ ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు శుభాకాంక్షలు చెప్పారు. సీతారామిరెడ్డి రాష్ట్ర కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లారని అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బాచిన చెంచు గరటయ్య అన్నారు.

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాలి

సామాజిక ఉద్యమ కార్యకర్త ఈదర గోపీచంద్ డిమాండ్



నరసరావుపేట: తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయి 40 మంది తీవ్రంగా గాయపడిన ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ వెంటనే పదవి నుంచి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తప్పుకోవాలని సామాజిక ఉద్యమ కార్యకర్త ఈదర గోపీచంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్లుగా తాను తిరుమలకు ఎప్పుడు రాలేదని తానే చెప్పుకున్న చైర్మన్ జరిగిన ఘటనకు చింతిస్తూ బేలతనం, అశక్తత ప్రదర్శించారని అన్నారు. అట్టి అసమర్థ, అర్హతలేని వ్యక్తిని నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిగ్గుపడాలన్నారు. గతంలో లడ్డూ ప్రసాదంపై ఏమాత్రం ఆధారంలేని విమర్శలతో రాద్ధాంతం చేసి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేసి చివరకు సుప్రీంకోర్టు చివాట్లు పెట్టడంతో కమిటీ వేసి మమ అనిపించారని పేర్కొన్నారు. నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆ కమిటీ విచారణ ఊసేలేదని ఇలా ఈ రెండు ఉదంతాలలో చంద్రబాబు అసమర్థత, కుట్ర రాజకీయం బయటపడిందని వెల్లడించారు. గత ఐదేళ్లలో భూమన కరుణాకర్‌రెడ్డి-వైవీ సుబ్బారెడ్డిల హయాంలో ఇలాంటి దారుణాలు ఏవీ జరగకపోగా అద్భుతంగా వినూత్న కార్యక్రమాలతో దేవస్థాన ప్రతిష్ఠ ఇనుమడించిందన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యేక ధరలు

ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్



ప్రకృతి సాగు ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి, హార్వెస్ట్ సీఈఓ మల్లిఖార్జున

నార్నెపాడు(ముప్పాళ్ళ): ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసి పండించిన పంట ఉత్పత్తులకు ప్రత్యేక ధరలు లభిస్తాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన సౌజన్య అనే మహిళా రైతుకు చెందిన మిరప పొలాన్ని హార్వెస్ట్ డిపో సీఈఓ మల్లిఖార్జునతో కలిసి గురువారం పరిశీలించారు. ప్రకృతి విధానంలో పండించిన పంట దిగుబడులను కొనుగోలు చేసేందుకు అనేకరకాల కంపెనీల వారు ఆసక్తి చూపుతున్నారన్నారు. బెంగుళూరు నుంచి హార్వెస్ట్ కంపెనీ ప్రతినిధికి సాగు చేసిన పొలాలను చూపించటం జరిగిందన్నారు. కంపెనీనే నేరుగా రైతుల వద్దకు వచ్చి మిరపకాయలు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారని, మార్కెట్ కంటే 10శాతం నుంచి 15శాతం అధికంగా ధర లభిస్తుందన్నారు. కొనుగోలు చేసేటప్పుడు రైతుల వద్ద నుంచి శాంపిల్ సేకరించి కెమికల్ టెస్ట్ చేసిన తర్వాత మాత్రమే వారు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. స్టేట్ మార్కెటింగ్ సిబ్బందితో కలిసి పొలాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎస్పీఎంయూ యూనిట్ సిబ్బంది పున్నారావు, పల్నాడు జిల్లా డీపీఎం యూనిట్ సిబ్బంది మేరీ, ఎన్ఎఫ్ఏ యూనిట్ ఇన్‌చార్జ్‌స్, ఐపీఆర్పీలు, ప్రకృతి వ్యవసాయ చేసే రైతులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పోస్టులకు 186 మందికి అర్హత



పరుగు పందెంలో అభ్యర్థులు



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థులు

నగరంపాలెం: స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు గురువారం నిర్వహించారు. 320 మంది హాజరవ్వగా, 79 మంది ధ్రువపత్రాలు తీసుకురాకపోవడంతో వెను దిరిగారు. ఇక 241 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు జరగ్గా, 21 మంది ఛాతీ, ఎత్తు కొలతలు సరిపోక తిరస్కరించారు. 219 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు జరగ్గా, 29 మందిని అనర్హులుగా ప్రకటించారు. 187 మందికి 100 మీటర్ల పరుగు పందెం ఏర్పాటు చేయగా 108 మంది అర్హత పొందారు. 191 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా, 186 మంది అర్హత సాధించారు. 241 మంది కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా, 186 మంది అర్హత సాధించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), ఎ.హనుమంతు (ఏఆర్) పోటీలను పర్యవేక్షించారు.

కొత్త వైరస్ గురించి భయం వద్దు



డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: హ్యూమన్ మెట న్యూమో వైరస్ గురించి ప్రజలు భయాందోళన చెందాల్సిన పనిలేదని, ఇది సాధారణ వైరస్ మాత్రమేనని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. 24 సంవత్సరాల క్రితమే దీనిని గుర్తించారని వెల్లడించారు. వైరస్ ద్వారా సంక్రమించే వ్యాధులకు యాంటి బయోటిక్స్ మందులు పనిచేయవని పేర్కొన్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ఈ వ్యాధి నుండి పూర్తిగా రక్షణ పొందవచ్చున్నారు. ఐదేళ్లలోపు పిల్లలు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధి బాధితులు, 60 ఏళ్లు దాటిన వారు మాత్రమే వైరస్ బారిన పడే అవకాశముందన్నారు. వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు:

- తరచు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి .
- మాస్కులు ధరించాలి.
- మంచినీరు ఎక్కువగా తీసుకోవాలి
- తాజా పౌష్టికాహారం తీసుకోవాలి
- వీలైనంతవరకు బహిరంగ ప్రదేశాల్లో, మార్కెట్ లో తిరుగకూడదు.
- దగ్గు, జలుబు ఉన్నవారికి దూరంగా ఉండాలి.
- ముక్కు, కళ్ళు తరచు చేతులతో తాకకూడదు.
- ఇతరులతో కరచాలనం చేయకూడదు.
- దగ్గు, జ్వరంతో బాధపడే పిల్లలను బడికి పంపకూడదు
- పిల్లలకు సకాలంలో ప్రభుత్వం ఇచ్చే అన్నీ టీకాలు వేయించాలి.

సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత



పెదకాకాని: మన సంప్రదాయాలను, సంస్కృతిని గౌరవించుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. డీఈవో హాజరయ్యారు. అందరూ సంక్రాంతి పండుగ ఘనంగా నిర్వహించాలని సూచించారు. ముందుగా ఉయ్ ఎక్స్‌ఎల్ సంస్థ నిర్వహించిన బేస్‌లైన్ టెస్ట్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులను అభినందించి బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాల గ్రౌండ్‌లో భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. భోగి పండ్లు పోసి చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆరోగ్య పరిశీలన బృందం సందర్శన

ఇంకొల్లు (చినగంజాం): విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిస్థితిని కాపాడుకునేందుకు సూచనలు చేసేందుకు రాష్ట్ర ఆరోగ్య పరిశీలనా బృందం గురువారం ఇంకొల్లు బాలికల హైస్కూల్‌ను సందర్శించింది. విద్యార్థినులు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఎన్‌సీడీసీడీ, ఆర్బీఎస్‌కే డాక్టర్ నర్సింగరావు, సైక్రియాట్రిస్ట్ డాక్టర్ సందీప్, ఇంకొల్లు వైద్యాధికారి డాక్టర్ టి.అంజలి, డాక్టర్ జి. భాను ప్రకాష్‌రావు, ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ బీవీ కోటేశ్వరరావు, పీహెచ్ఎన్ డి. సహస్ర, పాఠశాల హెచ్ఎం ఆర్.నాగేశ్వరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.